ప్రజాశక్తి
శనివారం 16 మార్చి 2024



నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం,పార్వతీపురం ఉమ్మడిజిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ అదాలత్‌లో బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సెక్షన్ 138 ఎన్ఐ యాక్ట్‌కు సంబంధించిన కేసులు, ఎక్సైజ్ కేసులు, మోటార్ ప్రమాద భీమా కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత కేసులు, విద్యుత్, నీటి పన్నుకు సంబంధించిన కేసులు, భూ సేకరణకు సంబంధించిన కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. పూల్‌బాగ్ కాలనీ హనుమన్ నగర్‌లోని నూతన కోర్టుభవనంలో ఉదయం 10గంటలకు అదాలత్ జరుగుతుందని తెలిపారు. కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపిలో సిట్టింగులకే ఛాన్స్?

- టిడిపిలో మూడు చోట్ల వీడని చిక్కుముడి
- నేడే ఎన్నికల నోటిఫికేషన్



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరపున దాదాపు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపిలకే మరోసారి అవకాశం దక్కనున్నట్టుగా తెలుస్తోంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఒకింత దీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం. శనివారం పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ వైసిపి అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్న నేపథ్యంలో సర్వత్రా చర్చ జరుగుతోంది. ఎన్నికలు దగ్గరపడిన నేపథ్యంలో జిల్లాలో దాదాపు రెండు నెలలుగా రాజకీయ వాతావరణం వేడెక్కిన సంగతి తెలిసిందే. వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ చాలా వరకు అభ్యర్థులను ప్రకటించినప్పటికీ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మాత్రం అభ్యర్థులను ప్రకటించలేదు. ఎస్.కోటలో స్థానిక ఎమ్మెల్యేను మార్చాలంటూ ఎమ్మెల్సీ రఘురాజు పట్టుబట్టినప్పటికీ అందుకు అధిష్టానం ససేమిరా అంటూ తేల్చేసింది. ఇక రాజాంలో మాత్రం కంబాల జోగులను తప్పించి వేరొకరిని నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించారు. జోగులకు పాయకరావుపేట ఇన్‌ఛార్జిగా అవకాశం కల్పించారు. అటు ప్రభుత్వంలోనూ, ఇటు వైసిపిలోనూ కీలకంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ రెండు జిల్లాలకు చెందిన ఎంపి, ఎమ్మెల్యేలను మార్చాల్సిన అవసరం లేదని అధిష్టానానికి చెప్పినట్టు, గెలిపించే బాధ్యత తాను చూసుకుంటానని భరోసా ఇచ్చినట్టు చర్చనడుస్తోంది. మరోవైపు జిల్లా పార్టీని సమన్వయం చేస్తున్న మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కూడా ఈసారి చట్టసభల్లోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ, ఈసారి పోటీలో కాకుండా పార్టీ విజయానికి కృషిచేయాలని పార్టీ అధినేత సూచించినట్టుగా సమాచారం. ఈ విధంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు యథాతథంగా కొనసాగితే ఈ రెండు జిల్లాల్లో ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం ఆయనకు దక్కే పరిస్థితి లేదు. రాజాం ఖాళీ అయినప్పటికీ అక్కడ రిజర్వేషన్ అనుకూలించదు. ఒకానొక దశలో ఎంపీ టిక్కెట్ శ్రీనివాసరావుకు కట్టబెడతారని చర్చ జరిగినప్పటికీ, ఎంపీ స్థానానికి, జెడ్‌పి పీఠానికి ముడిపెట్టడంతో చిన్నశ్రీను వెనక్కి తగ్గినట్టుగా చర్చనడుస్తోంది. ఎంపీగా పోటీచేసేందుకు బెల్లానకు మరో అవకాశం దక్కినట్టుగానే కనిపిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా సిటింగ్‌లకే టిక్కెట్లు దక్కనున్నట్లు తెలిసింది.

మరోవైపు టిడిపిలో చీపురుపల్లి అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపేందుకు అధిష్టానం నిర్ణయం చేయగా, ప్రత్యర్థిగా ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీకి ఆయన సాహశించడం లేదని సమాచారం. ఒకవేళ గంటా అక్కడి నుంచి సిద్ధపడకపోతే ఆయనకు మరోచోట అవకాశం కల్పించకపోవచ్చనే చర్చ నడుస్తోంది. గంటా నిర్ణయాన్ని బట్టి చీపురుపల్లిలో ప్రత్యామ్నాయం ఎవరనేది ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అటు ఎస్.కోటలో సీనియర్ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సీటు ఆశిస్తుండగా ఎన్ఆర్ఐల సహకారంతో గొంప క్రిష్ణ పోటీ పడుతున్నారు. అధిష్టానం ఇంతగా ఆలోచిస్తున్న నేపథ్యంలో ఇక్కడ కొత్త ముఖం అనివార్యమేనా? అంటూ ఊహాగానాలు వ్యక్తమౌతున్నాయి. అటు పాలకొండలో జయకృష్ణతోపాటు మరికొందరు నాయకులు సీటుకోసం తహతహలాడుతున్నారు.

మరోవైపు శనివారం మధ్యాహ్నం 3గంలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తక్షనమే ఎన్నికల మోడల్ కోడ్ అమలు లోకి రానుంది. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి కూడా ప్రకటన చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల పంపిణీ ఎక్కడికక్కడ నిలిచిపోనుంది.

నియోజకవర్గ స్థాయిలో కంట్రోల్ రూమ్

- ఎన్నికల ప్రకటన వెలువడిన నుండే విధులు
- నిర్దేశిత ప్రొఫార్మాలలో తక్షణ నివేదికలు
- స్వీప్ కార్యకమాలు నిర్వహించాలి
- అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికలలో సమన్వయంతో పని చేయడానికి, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడానికి జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గం స్థాయి లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లా స్థాయి, నియోజకవర్గం స్థాయిలో పని చేస్తున్న వారి మధ్య చక్కటి సమన్వయం ఉండాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కు కేటాయించిన అధికారులు, చేయవలసిన పలు రకాల విధులపై పిపిటి ద్వారా కలెక్టర్ అవగాహన కలిగించారు. కంట్రోల్ రూమ్ కు అందిన ఫిర్యాదులకు ఎన్నికల కమిషన్ ఒక్కో ఫిర్యాదుకు ఒక్కో కాల పరిమితిని సూచించిందని, వాటిని ఆయా టైం లైన్ లోపలే డిస్పోజ్ చేయాలని సూచించారు. ప్రధానంగా మోడల్ కోడ్ ఉల్లంఘన , ఏర్పాట్ల పై లోపాలు, ఓటర్ల సమస్యలు తదితర అంశాల పై వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి వెంటనే పరిష్కరించడం లేదా తదుపరి అధికారికి పంపడం జరగాలన్నారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులన్నీ కొన్ని గంటల్లోనే పరిష్కారం కావాలని సూచించారు. మోడల్ కోడ్ ఫిర్యాదుల పై క్షేత్ర స్థాయి బృందాలు విచారణ జరపాలని, తుది నివేదిక సంబంధిత రిటర్నింగ్ అధికారి మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేసారు. జిల్లా స్థాయి లో కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జిగా సిపిఒ, రిపోర్ట్స్ ఇన్‌ఛార్జిగా జిల్లా పరిషత్ సిఇఒ వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి, ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు ఐడి కార్డులను ఆర్ఒ జారీ చేయాలనీ సూచించారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన ఓటర్ హెల్ప్ లైన్ , ఆన్‌లైన్ పోర్టల్ , సాక్ష్యం యాప్ , సివిజిల్ , 1950 కాల్ సెంటర్ కు కు అందే ఫిర్యాదులను గడువు లోగా డిస్పోజ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, సహాయ కలెక్టర్ త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత , అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, కంట్రోల్ రూమ్ ఇంచార్జ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలి

నియోజకవర్గం , మండల స్థాయి లో ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ఓటరు అవగాహనా కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారంగా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులతో మట్లాడుతూ ప్రతి నియోజకవర్గం లో స్వీప్ కార్యక్రమాల కోసం ఇన్‌ఛార్జులను నియమించామని, తహశీల్దార్లు వెంటనే స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఆదివారం 2కె రన్ నిర్వహించాలని, వారికీ టీషర్టు లను ఇవ్వాలని తెలిపారు. 25 న మహిళా ఓటర్ల తో రాలీ నిర్వహించాలని, కళాజాతాలు ప్రదర్శించాలని, రంగోలి పోటీలను నిర్వహించాలని తెలిపారు. సీనియర్ సిటిజెన్లకు యోగ, మెడిటేషన్ వంటి కార్యక్రమాలను , యువతకు బైక్ రాలీలను వేర్వేరుగా నిర్వహించాలన్నారు. స్వీప్ నోడల్ అధికారి హౌసింగ్ పీడీ శ్రీనివాస రావు వీటన్నిటిని పర్యవేక్షించాలని సూచించారు.

అయ్యప్పనగర్ వాటర్ ప్లాంట్ సీజ్

ఇది ప్రజల విజయం : పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏడాది కాలంగా అయ్యప్పనగర్‌లోని అక్రమ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయాలని చేసిన పోరాట ఫలితంగా వాటర్ ప్లాంట్ సీజ్ చేసిన అధికారులకు, తమ పోరాటానికి అండగా నిలిచిన ప్రజా సంఘాల నాయకులకు, వార్డు ప్రజలకు పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు,అయ్యప్ప నగర్ పోరాట కమిటీ కన్వీనర్ యుఎస్ రవికుమార్ అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీజ్ చేసిన దృశ్యాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏడాది కాలంగా అయ్యప్ప నగర్ లో అక్రమంగా ఉన్న స్వాతీప్యూర్ ఫైర్ వాటర్ ప్లాంట్ వల్ల కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూ గర్భ జలాలు ఇంకి పోవడం వలన చుట్టుపక్కల నివాసాలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేసినప్పటికీ ఏడాది కాలంగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారన్నారు. అది అక్రమ వాటర్ ప్లాంట్ అని ఆధారాలు రుజువు కావడంతో ఎట్టకేలకు అధికారులు గురువారం వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారని తెలిపారు. ఏడాదిగా జరిపిన పోరాటంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఇతర ప్రజా సంఘాలు, వార్డు ప్రజలు అండగా నిలిచినందుకు వారికి అభినందనలు తెలిపారు.

అదే విధంగా నగరంలో అనేక అక్రమ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ సీజ్ చేసి నగర ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కంది. త్రినాథ్, ఎన్.సుధీర్ పాల్గొన్నారు.

ఎల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధం

- 3 లక్షల మందికిపైగా వస్తారని అంచనా
- పటిష్ట పోలీసు బందోబస్త్ ఏర్పాటు

ప్రజాశక్తి - జామి

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన జామి ఎల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. శనివారం తొలేళ్ల సంబరం జరగనుంది. ఆదివారం జరిగే జాతరకు భారీగా జనం తరలి వచ్చే అవకాశముంది. అందుకు వాతావరణం కూడా అనుకూలంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఈసారి జాతరకు మూడు లక్షలకు పైగా జనం తరలి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్లారమ్మ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాక రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి జనం తరలివస్తారు. ఎండలు అధికంగా ఉండటంతో ఈసారి చలివేంద్రాలు ఎక్కువగా ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. మెడికల్ క్యాంపులు, ఫైర్ వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

నేడే తొలేళ్ల సంబరం

ఎల్లారమ్మ జాతరలో ప్రధాన ఘట్టం తొలేళ్ల సంబరం. శనివారం రాత్రి అమ్మవారి గద్దె నుంచి పూజారి ఊరేగింపుగా బయలుదేరి ప్రధాన ఆలయ ప్రవేశం జరుగుతుంది. వేలాది జన సందోహం మధ్య ఊరేగింపు ఉంటుంది. నేల డ్యాన్సులు, తప్పెటగుళ్లు, విచిత్ర వేషధారణలతో ఊరేగింపు సంబరంగా సాగుతుంది. సాంస్కృతిక, పౌరాణిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నారు. అమ్మవారి ఆలయ ప్రవేశానంతరం యాత్రికులు ముడుపులు చెల్లించడానికి బయలు దేరుతారు. ఇలా ఆదివారం తెల్లవారు జాము నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు జాతర సాగుతుంది. సోమవారం చిన్న తీర్థం ఉంటుంది.

పటిష్ట బందోబస్తు

ఎస్‌పి దీపిక ఆదేశాలతో జాతరకు 200కు పైగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నారు. దొంగతనాల నివారణకు క్రైమ్ పోలీసులు మఫ్టీగా తిరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ట్రాఫిక్ నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపట్టారు.

నకిలీ సర్టిఫికెట్లతో

ప్రభుత్వ ఐటిఐలో ఉద్యోగం

- ఫిర్యాదుతో అధికారుల దర్యాప్తు
- ఉద్యోగం నుంచి తొలగింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో నకిలీ సర్టిఫికేట్‌లతో ఉద్యోగం పొందిన విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా అధికారుల దర్యాప్తులో నకిలీ సర్టిఫికేట్‌లుగా నిర్ధారణ కావడంతో ఉద్యోగం నుంచి అతనిని టెర్మినేట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా సొంపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మెట్ట సిద్దార్థ్ నకిలీ సర్టిఫికేట్‌లతో ప్రభుత్వ ఐటిఐలో 2021లో ఎటిఒగా ఉద్యోగం సాధించారు. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు నకిలీ సర్టిఫికేట్‌లతో సిద్దార్థ్ ఉద్యోగం పొందినట్లు ఐటిఐ ఉన్నతాధికారులకు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేశారు. విజయనగరం ఐటిఐ ప్రిన్సిపాల్, విజిలెన్స్ అధికారులు వేర్వేరుగా చేపట్టిన దర్యాప్తులో కిలీ సర్టిఫికేట్‌లను గుర్తించి ఉద్యోగం నుంచి అతన్ని టెర్మినేట్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్స్ చేశాఉ. దీంతో ఆయనను టెర్నినెట్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఒకే ఏడాదిలో ఇంటర్, ఐటిఐ సర్టిఫికేట్

మెట్ట సిద్దార్థ్ ఒకే ఏడాదిలో ఇంటర్, ఐటిఐ సర్టిఫికేట్ పొందినట్లు అధికారులు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా హరిపురం సిద్దార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసినట్లు 2010 జూన్‌లో సర్టిఫికేట్ పొందగా, అదే ఏడాది జూలైలో పలాస ప్రభుత్వ ఐటిఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ పూర్తి చేసినట్లు సర్టిఫికేట్ పొందారు. ఒకే ఏడాదిలో ఇంటర్, ఐటిఐ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు ఉండడంతో పాటు ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేసినట్లు నకిలీ సర్టిఫికేట్ గుర్తించారు.

పోలీసులకు ఫిర్యాదు

నకిలీ సర్టిఫికేట్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ జివి రమణరావు చెప్పారు. నకిలీ సర్టిఫికేట్‌లపై దర్యాప్తు చేయగా నిర్ధారణ కావడంతో సిద్దార్థ్‌ను ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేసినట్లు ఉన్నతాధికారులు నుంచి ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. ఉన్నతాధికారులు సూచనలతో పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశామని చెప్పారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చివరి రోజు ఒక విద్యార్థి డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, వంగర

ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి పరీక్షకు 18,938 మంది హాజరు కావాల్సి ఉండగా 17848 మంది హాజరుకాగా, 1089 మంది గైర్హాజరయ్యారు. వంగర మండలంలో ఒక విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడడంతో డిబార్ చేసినట్లు ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయనప తెలిపారు.

నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న పంప్‌హౌస్ కార్మికులు

నల్లరిబ్బన్లతో విధులకు..

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జీతాలు చెల్లించాలని కోరుతూ పంప్‌హౌస్ కార్మికులు నల్లరిబ్బన్లతో శుక్రవారం విధులకు హాజరయ్యారు. ముసిడిపల్లి, రామతీర్థం, నెల్లిమర్ల మాస్టర్ పంప్‌హౌస్ కార్మికులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ కార్మికులు అప్పారావు, సత్యనారాయణ మాట్లాడుతూ 8 నెలలుగా వేతన బకాయి చెల్లించాలని యూనియన్ పిలుపు మేరకు నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరైనట్లు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారులకు నగదు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఆడుదాం ఆంధ్ర తరుపున ఆడి గెలుపొందిన క్రీడాకారులకు ఎట్టకేలకు శుక్రవారం నగదు బహుమతి అందింది. 'ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు నిరాశ' అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో ప్రచురణమైన కథనానికి అధికారులు స్పందించి నియోజకవర్గస్థాయిలో రెండో స్థానంలో గెలుపొందిన కబడీ (మహిళలు) క్రీడాకారులకు వారి బ్యాంకు ఖాతాలో నగదును వేశారు..అయితే నియోజకవర్గ స్థాయి రెండో స్థానంలో గెలుపొందిన క్రీడాకారులకు జట్టుకు రూ.15వేలు చొప్పున ఒక్కొక్కరికి రూ.2100 ఇవ్వాల్సి ఉండగా, రూ 1250 చొప్పున మాత్రమే తమ ఖాతాలోకి వచ్చాయని క్రీడాకారులు తెలిపారు. మిగిలిన నగదు ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

కిక్ బాక్సింగ్ జాతీయ పోటీల్లో

దినేష్‌కు కాంస్య పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కిక్ బాక్సింగ్ జాతీయస్థాయి పోటీల్లో జెఎన్‌టియుజివి తరపున పాల్గొన్న విశాఖ రఘు కళాశాలకు చెందిన కె.దినేష్‌కు కాంస్య పతకం లభించింది. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు మీరట్‌లో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయి పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా దినేష్‌ను యూనివర్శిటీ విసి కె. వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ బయసుమ సత్కరించారు.

గ్రూప్ -1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

6,568 మంది అభ్యర్థులు...14 పరీక్షా కేంద్రాలు : జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 17న జరిగే గ్రూప్ 1 స్క్రీనింగ్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత ఆదేశించారు. స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణపై ఎపిపిఎస్‌సి ప్రతినిధులు, పరీక్షా కేంద్రాల ఛీఫ్ సూపరింటిండెంట్లు, లైజనింగ్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పరీక్ష నిర్వహించేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు, ఆయా అధికారుల విధులు, బాధ్యతలను వివరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, ఆదివారం జరిగే గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 6,568 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలు వరకు జరుగుతుందని చెప్పారు. పరీక్ష ప్రారంభానికి కనీసం గంటముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం పరీక్షకు 9.45 గంటలు తరువాత, మధ్యాహ్నం 1.45 గంటలు తరువాత, పరీక్షా కేంద్రం లోపలికి అభ్యర్థులకు ఎట్టి పరిస్థితిలోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. హాల్ టిక్కెట్‌తోపాటు ఒరిజనల్ గుర్తింపు కార్డు (పాస్‌పోర్ట్, ఓటర్ ఐడి, పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ ఉద్యోగి అయితే గుర్తింపు కార్డు)ను తీసుకురావాలని చెప్పారు. పరీక్ష పూర్తి అయ్యేవరకు అభ్యర్థులను బయటకు పంపించకూడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని చెప్పారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి చేయడానికి శుక్రవారం నుంచే కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 17 ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటలు వరకు ఈ కాల్ సెంటర్ (08922-236947, 7382242251, 9848381463) పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ వి.బాబూరావు, ఎఎస్ఒ పి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఒ అనిత

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

డెంకాడ.. అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-డెంకాడ

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఇవిఎంలను భద్రపరిచే, కౌంటింగ్ నిర్వహించే లెండి ఇంజినీరింగ్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లను శుక్రవారం ఎస్‌పి దీపిక పరిశీలించారు. పోలింగ్ అనంతరం ఇవిఎంలను లెండి ఇంజినీరింగ్ కళాశాలకు తరలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచనున్నారు. ఇవిఎంలను భద్రపర్చేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ నిర్వహించే గదులను ఎస్‌పి పరిశీలించారు. అధికారులకు భద్రతపరమైన పలు సూచనలు చేశారు. సిసి కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని, భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, భోగాపురం, విజయనగరం రూరల్ సిఐలు బి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎఎస్‌పి

శృంగవరపుకోట : ఎస్.కోట మండలంలోని వసి, వెంకటరమణ పేట, తిమిడి పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పర్యవేక్షించి, అధికారులకు పలు భద్రతపరమైన సూచనలు చేశారు. ట్రైనీ ఐపిఎస్ మండ జావళి ఆల్ఫాన్స్, ఎస్.కోట సిఐ మురళి, పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రత ఏర్పాట్లను ఎఎస్‌పికి వివరించారు.

సమావేశమైన టిడిపి నాయకులు

కళా, నాగార్జునకు టిక్కెట్ల ఖరారులో జాప్యంపై

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-రేగిడి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యధికంగా ఉన్న తూర్పు కాపు సామాజిక వర్గానికి ముఖ్యనేత అయిన టిడిపి సీనియర్ నాయకులు కిమిడి క ళా వెంకటరావుకు, కిమిడి నాగార్జునకు రెండో విడత కూడా టిక్కెట్లు కేటాయించకపోవడం పట్ల రాజాం నియోజకవర్గ నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం రాజాంలోని సూర్యదుర్గ కల్యాణ మండపంలో రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాలకు చెందిన టిడిపి నాయకులు పైల వెంకటరమణ, ఉదయాన మురళి, టంకాల గోవిందరావు, వెంకటేష్, కేశవరావునాయుడు, న్యాయవాది వైవి రమణ, కరణం ఢిల్లీశ్వరరావుతో పాటు పలువురు సమావేశం నిర్వహించారు. ఎచ్చెర్ల నియోజవర్గంలో కళా వెంకటరావును, చీపురుపల్లిలో కిమిడి నాగార్జునను అభ్యర్థులుగా ప్రకటించకపోవడం పట్ల వీరంతా నిరసన తెలిపారు. అధిష్టానం నుంచి ఎన్నడూ లేని విధంగా ముఖ్య నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యులైన కళాకు టిక్కెట్ ఖరారు చేయకపోవడం సరైనది కాదని అన్నారు. ఇది రాజకీయాల్లో తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కీలక నాయకులకు, పొలిట్‌బ్యూరో సభ్యులకు ఇటువంటి పరిస్థితి రావడం ప్రజల్లో తప్పుడు సంకేతాలకు తావిస్తుందని అన్నారు. ఇప్పటివరకు విడదుల చేసిన జాబితాల్లో తూర్పు కాపులకు న్యాయం జరగలేదని అన్నారు. కళా వెంకరావు పట్ల చంద్రబాబు వైఖరి సమంజసంగా లేదని ఆవేదన చెందారు. వెంటనే చంద్రబాబు స్పందించి ఎచ్చెర్లలో కళా వెంకటరావు, చీపురుపల్లిలో నాగార్జున పేర్లను అభ్యర్థులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎపిపిఎస్‌సిని భ్రష్టు పట్టించారు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపిపిఎస్‌సిని జగన్ వైసిపిఎస్‌సిగా మార్చేసి భ్రష్టు పట్టించారని, ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బెవర భారత్ మండిపడ్డారు. శుక్రవారం టిఎన్ఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి రూరల్ పోలీసుల్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ టిడిపి హయాంలో 169 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి 2018లో నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో అవకతవకలకు పాల్పడిందన్నారు.

గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలను నిర్ధారిస్తూ మెయిన్స్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులకు చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టిసి డిఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఆర్టిసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం శనివారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టిసి డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డిపో పరిధిలో గల ప్రయాణికులందరూ ఎటువంటి సమస్యలున్నా ఫోన్ ద్వారా తెలిపి నివృత్తి చేసుకోవాలని కోరారు. సమస్యలపై డిపో మేనేజర్ ఫోన్ నెంబరులో 9959225620 సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బాగుచేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేసి వ్యవసాయ మోటార్లకు కరెంటు సరఫరా చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిఐటియు జిల్లా నాయకులు ఎ.సురేష్ అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపెంటలో పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం వారు పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ పాడై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు.. రైతు సంఘం నాయకుల వద్ద వాపోయారు. అనంతరం గోపాలం, సురేష్ మాట్లాడుతూ అన్నదాతల పట్ల విద్యుత్తు శాఖాధికారుల నిర్లక్ష్యం సరికాదన్నారు.

తడిచెత్తతో ఇళ్లలోనే సేంద్రీయ ఎరువు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇళ్లలోనే తడిచెత్తతో సేంద్రీయ ఎరువు తయారు చేసి, పూలు, కూరగాయలు, పండ్ల మొక్కలకు వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామలక్ష్మి కోరారు. శుక్రవారం పట్టణంలో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారికి హెచ్‌డిపిఇ బిన్లను పంపిణీ చేశారు. ఇళ్లలో వస్తున్న తడిచెత్తతో సేంద్రీయ ఎరువు తయారు చేసి మొక్కలకు వినియోగించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కార్మికులకు సూచించారు.

కూలీలుగా మారిన విద్యార్థులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు మొదలవడంతో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు కెజిబివిలో ఉన్న బెంచీలను తీసుకొచ్చారు. ఈ బెంచీలన్నీ విద్యార్థులతో తరలించారు. ఈ తరహా పనుల కోసం నిధులు కేటాయించినా, విద్యార్థులతో పనులు చేయించి బిల్లులు పెట్టుకుని కాజేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులతో పనులు చేయించిన ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కొత్తవలస

మందులను పరిశీలిస్తున్న జడ్జి విజయ్‌చంద్ర

కొత్తవలస మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్, రామదండు చారిటబుల్ ట్రస్ట్, మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జూనియర్ సివిల్ జడ్జి విజయ్ చంద్ర ప్రారంభించారు. శిబిరంలో మెడికవర్, వెంకటేశ్వర ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. మందులను విజయ్‌చంద్ర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపిపి రమణమ్మ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్మూర్తి, ప్రధానకార్యదర్శి గిరిబాబు, మాజీ ప్రెసిడెంట్ గొడుగుల మహేంద్ర, గవర కృష్ణ, రామచంద్ర ప్రసాద్, డి.శివప్రసాద్, డి.శ్రీనివాస్, గాలి ఈశ్వరరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. పోషణ పక్వాడాపై నాలుగో వార్డులో ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలన్నారు. సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్వాడీలకు సూచించారు.

సెంచూరియన్‌లో గజజ్యోతి వేడుకలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యార్థులు ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి గజజ్యోతి వేడుకలు ఎంతో దోహదపడతాయని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో గజజ్యోతి-2024 వేడుకలను ఆయన ప్రారంభించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్లు ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, రమణారావు, సన్నీ డయాజ్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డాక్టర్ పుష్పలత తదితరులు మాట్లాడారు. అనంతరం క్యాంపస్‌లో నృత్య, పులివేషాలతోపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కెజిపూడి గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లను ఎంఇఒ పి.బాల భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. వసతులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

పలు భవనాలు ప్రారంభం

చీపురుపల్లి : మండలంలోని నూతనంగా నిర్మించిన పలు భవనాలను ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష ప్రారంభించారు. శుక్రవారం వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడుతో కలిసి మెట్టపల్లి సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్రం, కరకాం సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి వైస్ ప్రెసిడెంట్ దన్నాన జనార్దన్, బెవర ఉమ, పిఎసిఎస్ అధ్యక్షులు చందక శ్రీను, ఎంపిటిసి మీసాల ఈశ్వరావు, గంగుబిల్లి సూరిబాబు, సర్పంచ్ జమ్ము సావిత్రి, సునీల్, తాడ్డి మీసాల శ్రీను, ఇ.పిఆర్‌డి అన్నపూర్ణ, కర్లాం పిహెచ్‌సి వైద్యులు సువర్ణ పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుళ్లకు సత్కారం

లక్కవరపుకోట : లక్కవరపుకోట పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లను ఎస్ఐ ఆర్.గోపాలరావు శుక్రవారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని, వారి ధైర్య సాహసాలు గురించి కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌సిలు పాపారావు, కొండబాబు, పిసిలు పోతురాజు , సత్యనారాయణ, శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బేబినాయన ఔదార్యం

తెర్లాం : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన మంచిమనసును మరోసారి చాటుకున్నారు. నెమలాం, యడ్లవలస గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తెలుసుకున్న ఆయన సొంత నిధులతో బోర్లు ఏర్పాటుచేశారు. దాహార్తిని తీర్చిన బేబినాయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

వేపాడ : వల్లంపూడిలో శుక్రవారం దళిత మహాసభ మండల అధ్యక్షులు కొమ్మునాపల్లి రాము ఆధ్వర్యంలో బిఎస్‌పి వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమములో శ్రీను, జి.అప్పారావు, ఆర్.సన్నిబాబు, కె.అప్పారావు, జబర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం

విజయనగరం కోట : నగరంలోని 14వ డివిజన్‌లో కొత్తపేట బ్రాహ్మణవీధిలో బ్రాహ్మణ కమిటీ నాయకులు 'బాబు చెంతకు...బ్రాహ్మణాస్త్రం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కమిటీ నాయకులు పేరి రామయ్య, ఉప్పగుంటి రమేష్, శర్మ, మద్దాల నాగకుమార్, ధవళ వెంకట్రావు, ద్వాదశి వేణు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

వేపాడ : మండలంలోని ఎస్‌కెఆర్ పురం పంచాయతీ పరిధిలోని భరతవాని పాలెం, మద్దిచెట్టు కల్లాలు, కరుణ వారి వీధిలో తాగునీటి బోర్లకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. పనులను వైస్ సర్పంచ్ కె.పెదనాయుడు పర్యవేక్షించారు.

వడ్డీ మాఫీని వినియోగించుకోండి

బొబ్బిలి : వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆర్ఒ పి.ప్రసాద్, ఆర్ఐ డి.గిరిధర్‌రావు, పి.సురేష్ కోరారు. మార్కెట్లో షాపులు నుంచి ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక బృందంగా వెళ్లి వసూళ్లు చేపట్టారు. నెలాఖరులోగా ఆస్తిపన్ను చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని కోరారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

స్వీప్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా కోట జంక్షన్ వరకు శుక్రవారం నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని, కలెక్టరేట్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్యం చేసే ఉద్దేశంతో వివిధ రకాల అవగాహనా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే మొదటి విడత స్వీప్ కార్యక్రమం పూర్తి అయ్యిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజన తెగలు నివసించే ప్రాంతాలు, సంతలు, మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి, ఓటుహక్కు వినియోగించే విషయంలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇటీవలే ఓటుహక్కు పొందిన యువ ఓటర్లను ఉత్సాహ పరిచే కార్యక్రమంలో భాగంగా ఈ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసి, అత్యధిక ఓటింగ్ శాతం నమోదు చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎవి రత్నం, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, యువ ఓటర్లు పాల్గొన్నారు.

స్వీప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విద్యార్థులంతా ఓటువేసేలా ప్రోత్సహించాలి

ప్రజాస్వామ్య ప్రక్రియలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. ఓటువేయడం ద్వారానే ఈ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఓటు హక్కు కలిగిన విద్యార్థులంతా రానున్న సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు ఓటు వేసేలా వారిని చైతన్య పరచడంలో క్యాంపస్ రాయబారులు కీలకపాత్ర వహించాలన్నారు. జిల్లాలో ఓటర్ల చైతన్య కార్యక్రమం స్వీప్‌లో భాగంగా పలు కళాశాలల్లోని క్యాంపస్ అంబాసిడర్లతో జాయింట్ కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. కళాశాల విద్యార్థులు, యువతతో ఓటు విలువను తెలియజేయడం, వారు ఓటింగులో పాల్గొనేలా చేయడంకోసం ఉద్దేశించిన 23 పదుగు వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సామాన్యులకు అర్థమయ్యే రీతిలో పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ట్రైని అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్ చెప్పారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షలో సత్తాచాటిన మెంటాడ విద్యార్థి

మెంటాడ : కోరుకొండ సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షలో మెంటాడ మండల కేంద్రానికి చెందిన సువ్వాడ త్రివేద్ సత్తాచాటాడు. 300 మార్కులకు గాను 258 మార్కులు సాధించాడు. జనవరి 28న సైనిక స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మెంటాడ గ్రామానికి చెందిన సువ్వాడ త్రివేద్ గజపతినగరం హర్షవర్ధన్ స్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నాడు. మెంటాడ విద్యార్థి అత్యధిక మార్కులు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

24న పైడితల్లమ్మ పండగ

భోగాపురం : మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఈనెల 24న పైడితల్లి అమ్మవారి పండగ జరుగనుంది. ఈ పోస్టర్‌ను ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు అప్పలనాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. పోలిపల్లికి చెందిన కర్రోతు వాణి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చులు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.50వేలు చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, మాజీ ఉపసర్పంచ్ పతివాడ రామకృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుర్ల

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గుర్ల మండలంలో కొండగండ్రేడులో సచివాలయం, రైతు భరోసా భవనాలను శుక్రవారం ప్రారంభించారు. లోదమరసింగి గ్రామానికి రూ.1.8 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే లభిస్తున్నాయని తెలిపారు. సచివాలయాల ద్వారా అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, కె.వి. సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్లు బంగారునాయుడు, మధుసూదన్‌రావు, వైసిపి మండల అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ సారిక గోవింద, ఎంపిటిసి మణిపూరి రామారావు, ముద్దాడపేట సర్పంచ్ సురేష్, ఎంపిడిఒ వెంకటరమణ పాల్గొన్నారు.

గరివిడి : గరివిడిలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం మేము సిద్ధం - మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మెరకముడిదాం మండలంలో వాలంటీర్లు, బూత్ కన్వీనర్లు, సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వాలంటీర్ వ్యవస్థ ద్వారా అందించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. చంద్రబాబు నాయుడు గ్యారెంటీల పేరిట అమలు చేయలేని హామీలిచ్చి ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సమావేశంలో వైసిపి నాయకులు బొత్స సందీప్, తాడ్డి వేణు, ఎస్‌వి రమణరాజు, జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు, జెసిఎస్ కన్వీనర్ కె.రాము, వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు, బుర్ల నరేష్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే విజయం

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-చీపురుపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున

వచ్చే సార్వత్రిక ఎన్నికలలో కూటమిదే విజయమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగార్జున మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, రానున్న ఎన్నికల్లో జగన్ ను ఇంటికి పంపించి కూటమికి అధికారాన్ని ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మోడీ సహకారం అవసరమన్నారు. గ్రూప్-1 పరీక్షల్లోనూ జగన్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా జగన్ ప్రభుత్వాన్ని ఎంత వేగంగా బంగాళాఖాతంలో కలిపేద్దామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని నాగార్జున అన్నారు. ఈ నెల 17 చిలకలూరిపేటలో జరగనున్న తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి సభకు మూడు పార్టీల శ్రేణులంతా భారీసంఖ్యలో తరలి వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి, జనసేన నాయకులు మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు కష్ట పడిన నాగార్జున కు టికెట్ కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎస్ వి ఎల్ ఎన్ రాజు, మన్నే పూరి శ్రీనివాస రావు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీను, టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, దన్నాన రామచంద్రుడు,తాడ్డే సన్యాసి నాయుడు, సారేపాక సురేష్, కోట్ల సుగుణాకర రావు, ముల్లు రమణ మహంతి రమణ మూర్తి, బలగం వెంకటరావు, మండల చంటి, కెంగువ ధనుంజయ, మహంతి అప్పలనాయుడుపాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

పట్టణం లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికలకు శుక్రవారం పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు మండా కామేశ్వరరావు, జి.సూరి దేముడు, కార్యదర్శి పదవికి డబ్ల్యుఎన్ శర్మ, బివిఎస్ రామారావు, బి.సత్యనారాయణ, బి.రామకృష్ణ, ఉపాధ్యక్ష పదవికి ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శి పదవికి ఎల్.అప్పారావు, ట్రెజరర్ పదవికి బి.త్రిమూర్తులు నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారిగా మామిడి చంద్రశేఖర్, సహాయ అధికారిగా బొబ్బిలి రామకృష్ణ వ్యవహరిస్తున్నారు. 28న ఓటింగ్ జరగనుంది. కార్యక్రమంలో న్యాయవాదులు వారాది ఈశ్వరరావు, సిహెచ్‌ఆర్‌ఎ నాయుడు, బి.వెంకటరావు, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయాభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి-వంగర

ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

సంగమేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలే రాజేష్ అన్నారు. మండలంలోని సంగాంలో సంగమేశ్వర స్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు టెంపుల్, శ్రీవారి కల్యాణ మండపం, భోగశాల, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లు నిర్మించేందుకు సిజిఎఫ్ నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు కావడంతో ఎమ్మెల్సీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. తొలుత ఆలయంలో ఇఒ శివకేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంగాం గ్రామంలో సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శన్‌రావు, తహశీల్దార్ చిరంజీవి పడాల్, ఎంపిడిఒ సల్మాన్‌రాజు, సర్పంచ్ గేదెల పారమ్మ, ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావు , గేదెల రామకృష్ణ ఊగిరి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

ఎంసిసిపై సమీక్ష

ప్రజాశక్తి-తెర్లాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంసిసి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)పై ఎంపిడిఒ మధుసూదనరావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీకార్యదర్శులు, విఆర్‌ఒలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక గ్రామాల్లో వ్యక్తులను ప్రేరేపించే విధంగా ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లను తొలగించాలన్నారు. నేతల విగ్రహాలకు ముసుగులు తొడగాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామాల్లో నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావు, ఎస్ఐ ఆర్.రమేష్ పాల్గొన్నారు.

తూర్పు కాపులకు టికెట్లు ఇవ్వాలి

తూర్పు కాపు సామాజిక వేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

తూర్పు కాపులు అత్యధికంగా ఉన్నచోట్ల ఎంపి,ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వాలని రాజకీయ పార్టీలను తూర్పు కాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షులు రొంగలి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. దీక్షను ఉద్దేశించి వారు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా కాపు సామాజిక వర్గం ఓటర్లు ఉన్నారన్నారు. రాజ్యాధికారం ఇవ్వడంలో రాజకీయ పార్టీలు తూర్పు కాపుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. తూర్పు కాపులంతా ఏకమై రాజ్యాధికారం కోసం సాధించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. తాము జెండాలు మోసెందుకి లేమని రాజ్యాధికారం కావాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్ష లో ఎం.రామారావు, ఎస్.సాంబ, జి.మోహనరావు, టి.వెంకటరావు, ఎస్.సత్యన్నారాయణ, సిహెచ్ చిన్ని, జి.వెంకట రమణి, పి.రామారావు, పి.సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-వేపాడ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

మండలంలోని వావిలపాడు గ్రామంలో ఇటీవల మరణించిన భూమిరెడ్డి కుటుంబానికి రూ.2 లక్షలు సిఎం సహాయనిధి ద్వారా మంజూరైంది. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బీల సతీష్, జగ్గు బాబు, నాగిరెడ్డి రాజు నాయుడు, భూమిరెడ్డి ప్రవీణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-డెంకాడ

శంకుస్థాపన చేస్తున్న పిఎసిఎస్ చైర్మన్ రొంగలి

మండల కేంద్రం డెంకాడలో సుమారు రెండు కోట్ల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ కనక సింహాచలం మాట్లాడుతూ పంచాయతీ నిధులతోపాటు ప్రభుత్వ నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో కొన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఆదినారాయణ, నాయకులు గోపాలకృష్ణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మండలంలో నాతవలస గ్రామంలో సిసి కాలువ, రోడ్డుకు మాజీ సర్పంచ్ బమ్మిడి వెంకటరమణ, రాష్ట్ర ఎడ్యుకేషనల్ డైరెక్టర్, గ్రామ నాయకులు శంకుస్థాపన చేశారు.

నాడు -నేడు పనులు వేగవంతం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో మనబడి నాడు-నేడు రెండో దశ పనులు వేగవంతం చేయాలని ఎంఇఒ తిరుమలప్రసాద్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నాడు-నేడు పేజ్- 2 పనుల కోసం రివాల్వింగ్ ఫండ్ ఖాతాల్లో జమ చేశామని, వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయకపోతే మిగిలిన మొత్తాన్ని టిఇఒ ద్వారా అవసరమున్న పాఠశాలకు నగదు బదిలీ చేస్తామని స్పష్టంచేశారు. తాగునీరు, విద్యుద్దీకరణ పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. అన్ని రికార్డులు, రిజిష్టర్లు సకాలంలోనే అప్‌డేట్ చేయాలన్నారు. ఖర్చు చేసిన నిధులకు తల్లిదండ్రుల కమిటీ తీర్మానం తప్పనిసరిగా తీసుకొని, బిల్లులు వెంటవెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో డిఇ జగ్గారావు, ఎంఇఒ-2 పెంటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని తామరపెల్లి గ్రామంలో శుక్రవారం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. బొండపల్లి మండలం కొండపేట గ్రామానికి చెందిన జి.వెంకటరమణ, జి.పవన్‌కుమార్ బైక్‌పై వెళ్తుండగా, కొండతామరపల్లి వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరమణ, పవన్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో వారిని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

ఎంఇఒ విమలమ్మకు సత్కారం

ఎంఇఒ విమలమ్మ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గజపతినగరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ మహిళ మండల విద్యాశాఖ అధికారినిగా ఇటీవల జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్.విమలమ్మను శుక్రవారం మండల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎంఇఒ-2 సాయిచక్రధర్ అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులంతా ఎంఇఒ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విమలమ్మ విధి నిర్వహణలో అంకితభావం, కఠోర శ్రమకు ఈ అవార్డు దక్కిందన్నారు. జిల్లాలో గజపతినగరం మండలం ఎల్లవేళలా విద్యాపరంగా ముందంజలో నిలవడానికి ఆమె కృషి ప్రధాన కారణం అన్నారు. సన్మాన గ్రహీత ఎస్. విమలమ్మ మాట్లాడుతూ, ఈ అవార్డు, ఈ సన్మానాలు తన బాధ్యత మరింత పెంచాయన్నారు. విధి నిర్వహణలో అందరి సహకారం తోనే సమర్థవంతంగా పనిచేయగలుగుతున్నానని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ .రమేష్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, జి.కృష్ణమనాయుడు, వి.నాగమణి, జి.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

జాతర ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు

ప్రజాశక్తి - జామి

ఎల్లారమ్మ జాతరకు లక్షలాది మంది వచ్చే అవకాశముందని, జాతర ఏర్పాట్లలో లోటుపాట్లకు లేకుండా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ ఇండియన్ మిషన్ మండల కన్వీనర్ ఇప్పాక ఈశ్వరరావు, రామారావు కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు.

ఎల్లారమ్మ జాతరకు వచ్చే యాత్రికులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో సైనిక్ కన్వీనర్ కాటపల్లి రామారావు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టువారి దివ్యసముఖమునకు
OS 102/2023

Between :
Sambangi Srinivasa Rao ....Plaintiff/వాది
And :
Pappu Venkata Rao...Defendant/ప్రతివాది
To
పప్పు వెంకటరావు, S/o అప్పారావు, వయస్సు 40 సం॥, కునాయవలస, ప్రస్తుతం డర్రు సత్యం అభిరుచి హోటల్ బిల్డింగు 3rd Floor, NTR Street, పీటాపురం కోలనీ, కళాభారతి ఆడిటోరియం, మద్దిలపాలెం, విశాఖపట్నం.

పై నెంబరు దావా యిందలి ప్రతివాది సొమ్ము రాబట్టె నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా వాయిదా **తేది 20-3-2024**కి వాయిదా అయి యున్నది. సదరు వాయిదా దినం **ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టులో స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావా తీర్మానించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం
తియ్యాల జయప్రకాశ్ బాబు
వాది తరుపు వకీలు,
బొబ్బిలి

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వార్కి
EP 69/2019 OS 155/2016

Between :
నీలాపు ఉమ ......DHR/వాది
And :
శ్రీమతి ఊశిరికల రత్నమాల ......JDR/ప్రతివాది
To
శ్రీమతి ఊశిరికల రత్నమాల, W/o ఉమా శంకరరావు, R/o Plot No.G.5, North Gate, సుభద్రమ్మ అపార్ట్‌మెంటు, శ్రీధర్‌నగర్, S.B.T. మార్కెట్టు, కంటోన్‌మెంట్, విజయనగరం.

పై నెంబరు అమలు పిటిషనులో శ్రీ కోర్టువారి ముందు Sale Consideration నిమిత్తం అమలు పిటిషను దాఖలు చేసి యున్నాము. శ్రీ కోర్టువారి ద్వారా మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినన్ను కాలయాపన చేయుచున్నందున పై కోర్టులో **తేది 25-3-2024న ఉదయం 10-30గంటల**కు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెయును. లేనియెడల పరోక్షంగా తీర్మాణించబడునని యిందుమూలంగా తీర్మాణించబడును.

ఇట్లు
శ్రీ కంటుభుక్త శ్రీనివాసరావు,
అడ్వకేటు, నెల్లిమర్ల,
విజయనగరం, సెల్: 9440282934